## ఏడు వేల ఉన్నత పాఠశాలల్లో

# ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్

• ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు



**అమరావతి, ఆంధ్రప్రభ:**2024 - 25 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని 7,094 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్‌ను అమలు చేయనున్నట్లు పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. భవిష్యత్‌లో అవకాశాలు, సాంకేతికతను అందిపుచ్చుకునే అంశంలో విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేందుకు వీలుగా జూన్ 12వ తేదీ నాటికి 2,379 మంది ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్‌ను ఎంపిక చేసి విధులు కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన, అభ్యసనాన్ని మెరుగు పరిచేందుకు వీలుగా ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్‌ను ఎంపిక చేయనున్నామన్నారు. ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్ ఎంపిక విషయమై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ తో సంప్ర దింపులు జరపాలని ఆర్జేడీలు, డీఈవోలకు సూచించారు. ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్ విధుల నిర్వహణకు సంబంధించి ఇంజనీరింగ్ కాలేజీలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల మధ్య మ్యాపింగ్ పూర్తయిందని, సంబంధిత జీవో ఇప్పటికే జారీ చేశామని ప్రవీణ్ ప్రకాష్ గుర్తుచేశారు. విద్యార్థుల్లో భవిష్యత్ తరాలకు అవసరమైన విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ విద్యా సంవత్సరం (2024-25) నుండే మూడు పాఠశాలలకు ఒక ఎక్స్ పర్ట్ చొప్పున నియమించి అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నామన్నారు. ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్ పనితీరు, ఎంపికకు సంబంధించి ఆయా విద్యార్థుల నుండి డీఈవోలకు అందిన నివేదికలను 21 మే, 2024 నాటికి సమీక్షించి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉత్తమమైన ముగ్గురిని ఎంపిక చేయాలన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారి సమాచారాన్ని 2024 మే 22వ తేదీ నాటికి మిషన్ డైరెక్టర్‌కు పంపించాలని డీఈవోలను ఆదేశించారు. అనంతరం 2024 మే 27న ప్రతి జిల్లా నుండి ఒకరి చొప్పున రాష్ట్ర ఎంపిక కమిటీ ఎంపిక చేసిన 26 మంది ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్ తో వర్చువల్ గా మాట్లాడతానన్నారు. అదే విధంగా 2024 మే 31వ తేదీ నాటికి ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ తో సమన్వయం చేసుకోవాలని ఆర్జేడీలకు, డీఈవోలకు సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు బోధించేందుకు ఎంపికైన ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్‌కు మూడేళ్ల ఇంజినీరింగ్ కోర్సుకు సంబంధించిన ప్రాథమిక భావనలతో కూడిన ఫ్యూచర్ స్కిల్స్ పాఠ్య పుస్తకాన్ని ఈ-బుక్ ఫార్మాట్ లో అందించాలన్నారు. తద్వారా వారిని అంచనా వేసేందుకు వీలు కలుగుతుందని, జూన్ 10వ తేదీన ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్‌కు ఆన్ లైన్ పరీక్షను నిర్వహించనున్నామని తెలపాలని సూచించారు. ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్స్ ఎంపిక విషయంలో ప్రతిరోజు వారి పురోగతిని పరిశీలించి సమీక్షించాలని కోరారు. 12 జూన్ నాటికి రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ప్రతి మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒక ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్ పర్ట్ ను నియమించాలని ఆర్జేడీలు, డీఈవోలకు సూచించారు.

# 20 నుంచి జూ.కళాశాలల విద్యార్థులకు కౌన్సెలింగ్



గురుకులాల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

• 5 నుంచి 8వ తరగతుల వారికి, 16 నుంచి పాఠశాలల కేటాయింపు
• ఎంపికైన అభ్యర్థులకు నేడు ఎస్ఎమ్ఎస్ ద్వారా సమాచారం
• ఫలితాలను విడుదల చేసిన కమిషనర్ సురేష్ కుమార్

**అమరావతి,ఆంధ్రప్రభ:**రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీకళాశాలలో 2024 - 25విద్యాసంవత్సరానికి గాను ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ యేడాది ఏప్రిల్ 25న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ గారు, కార్యదర్శి ఆర్. నరసింహారావుగారు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్, అభ్యర్థి నమోదు చేసిన పాఠశాల ప్రాధాన్యతా క్రమం ఆధారంగా ఎంపిక చేసినట్లు కమిషనర్ తెలిపారు.

5వ తరగతిలో యం. కీర్తి (విశాఖపట్నం జిల్లా) - 99 మార్కులు, 6వ తరగతిలో పి. సోమేశ్వర రావు (విజయనగరం జిల్లా) 87మార్కులు, 7వ తరగతిలో కె. ఖగేంద్ర (శ్రీకాకుళం జిల్లా) 88మార్కులు, 8వ తరగతిలో వై. మేఘ శ్యామ్ (విజయనగరం జిల్లా) 83మార్కుల లతో ప్రథమ స్థానంలో నిలిచారు.

5వ తరగతిలో 3195 సీట్లకు గాను 21056 మంది దరఖాస్తు చేసుకోగా 17312 మంది పరీక్షలకు హాజరయ్యారు. 6వ తరగతిలో 257 సీట్లకు గాను 5936 మంది దరఖాస్తు చేసుకోగా 3969 మంది పరీక్షలకు మాజరయ్యారు. 7వ తరగతిలో 146 సీట్లకు గాను 2577 మంది దరఖాస్తు చేసుకోగా1750 మంది పరీక్షలకు హాజరయ్యారు. 8వ తరగతిలో 172 సీట్లకు గాను 3097 మంది దరఖాస్తు చేసుకోగా 2185 మంది పరీక్షలకు హాజరయ్యారు. 5,6,7,8 తరగతులకు 3770 సీట్లు ఉండగా 32,666 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 25,216 మంది పరీక్షలకు హాజరయ్యారు.

***ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో***

ఇంటర్ ఎంపీసీ / ఈఈటిలో జ. యశ్వంత్ సాయి (తూర్పు గోదావరి జిల్లా) 142మార్కులు, బైపిసి / సిజిటిలో యం. మహిత (కర్నూల్ జిల్లా) 137మార్కులు, ఎంఈసీ / సీఈసీ ఎల్. సత్యరామ్ మోహన్ (తూర్పు గోదావరి జిల్లా) 140మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు.

ఇంటర్ ఎంపీసీ 474, బైపీసీ 334, ఎంఈసీ/సీఈసీ 341 చప్పున మొత్తం 1149 సీట్లు అందుబాటులో ఉండగా 56, 949 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 49, 308 మంది పరీక్షలకు హాజరయ్యారు. డిగ్రీలో బీఏ యం. రవీంద్ర వర ప్రసాద్ (ఏలూరు జిల్లా) 113మార్కులు, బికాం టి. గణేష్ (అన్నమయ్య జిల్లా) 112మార్కులు, బీఎస్సీ (ఎంపీసీ) బి. సాయి కృపారెడ్డి (శ్రీకాకుళం జిల్లా)118మార్కులు, బీఎస్సీ ( ఎంఎస్‌సిఎస్) బి. రాజశేఖర్ (వైఎస్ఆర్ కడప జిల్లా) 103మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు.

బీ ఏ 40, బీ కాం 40, బీ ఎ స్సీ (ఎం పీ సీ ) 36, బీ ఎ స్సీ (ఎంఎస్‌సిఎస్) 36 మొత్తం 152 సీట్లకు గాను 1209 మంది దరఖాస్తు చేసుకోగా 963 మంది పరీక్షలకు హాజరయ్యారు.

***రేపటి నుంచి కేటాయింపు ప్రక్రియ ప్రారంభం***

ఎంపికయిన విద్యార్థులకు నేడు ఎస్ఎమ్ఎస్ ద్వారా మొబైల్ ఫోన్‌కు సమాచారం అందించనున్నట్లు కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఎంపికయిన విద్యార్థుల జాబితాను http://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్ నెంబరు ఆధారంగా ఫలితాలను తెలుసుకోవచ్చని సూచించారు. ఎంపికయిన 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 1:1 నిష్పత్తిలో ప్రతిభ, రిజర్వేషన్, పాఠశాల ప్రాధాన్యతా క్రమంలో 16వ తేదీ నుంచి పాఠశాలలను కేటాయించనున్నట్లు కమిషనర్ తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు 1:5 నిష్పత్తి ప్రకారం ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో వేరు వేరుగా కౌన్సిలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలలను కేటాయించున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాలలను 1:10 నిష్పత్తి ప్రకారం ఈ నెల 23వ తేదీన గుంటూరులో కౌన్సిలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 మైనార్టీ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశ పరీక్షతో నిమిత్తం లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఏపీఆర్ఈఐ సొసైటీ కార్యదర్శి ఆర్. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి హెచ్. ఎండీ ఉబేదుల్లా, లైజన్ ఆఫీసర్ పి.వి.మల్లేశ్వర్ పాల్గొన్నారు.

## పది సప్లిమెంటరీ పరీక్షలు...

# నేడు హాల్‌టిక్కెట్లు విడుదల

**అమరావతి, ఆంధ్రప్రభ:**పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను నేడే విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి. దేవానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నేటి నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాల్‌టికెట్లను డౌన్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షల ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు దేవానందరెడ్డి తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన

# కాలువలకు మరమ్మతులు చేపట్టాలి



**అమరావతి,ఆంధ్రప్రభ:**రాష్ట్రంలో కాలువల నిర్వహణ పనులపై గత అయిదేళ్లుగా దృష్టిపెట్టలేదని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు.. సాగు నీటి అవసరాలు తీర్చే కాలువలు, వాటికి సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలకు అవసరమైన నిర్వహణ, మరమ్మతులు వేసవి సమయంలో చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికల హడావిడి ముగిసిన తరుణంలో- మధ్యంతర ప్రభుత్వం ఈ అంశంపై జల వనరుల శాఖతో సమీక్షించాలన్నారు. ప్రభుత్వ అధికారులు కాలువలకు సంబంధించిన నిర్వహణ పనులపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ఏ పంట కాలువ చూసినా పూడిక చేరిపోయి, తుప్పలు, తూటి కాడలు పెరిగిపోయి ఉన్నాయన్నారు.

కాలువలకు నీరు వదిలినా ప్రవాహం ముందుకు వెళ్ళే పరిస్థితి లేదన్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందటం లేదన్నారు. కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం గత యేడాది పశ్చిమ కృష్ణా డెల్టాలో పంటలు ఎండిపోయాయని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా రైతాంగం నుంచి ఈ సమస్యపైనే తనకు ఎక్కువ విజ్ఞాపనలు వచ్చాయన్నారు. జలవనరుల శాఖ యుద్ధ ప్రాతిపదికన కాలువలకీ, లాకులకు మరమ్మతులు ఈ వేసవి ముగిసేలోగా పూర్తి చేయాలని కోరారు. రుతు పవనాలు ప్రవేశించేలోగా పనులు పూర్తయితేనే రైతాంగానికి మేలు జరుగుతుందని పవన్ పేర్కొన్నారు.

## అమ్మవారి ఆలయంలో

# కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

***22 నుండి 24వ తేదీ వరకు వసంతోత్సవాలు***



**తిరుచానూరు, ప్రభన్యూస్:**తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం లో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ సంద ర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసి నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కు చెందిన స్వర్ణ కుమార్ రెడ్డి అమ్మవారి ఆలయానికి 11 పరదాలను ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, శ్రీవాణి ఇన్స్పెక్టర్లు సుభాష్, గణేష్, ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 22 నుండి 24వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం మే 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మే 23వ తేదీ ఉదయం 7.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఈ ఉత్సవాల కారణంగా మే 21 నుండి 24వ తేదీ వరకు కల్యాణోత్సవం, సహస్రదీపాలంకరణసేవ, మే 23న తిరుప్పావడ సేవ, మే 24న లక్ష్మి పూజ ఆర్జితసేవలను టీటీడీ రద్దు చేసింది.

# ఏపీలో ఎవరొచ్చినా సత్సంబంధాలు

(మొదటిపేజీ తరువాయి)



చెప్పారు. తనదంతా సానుకూల దృక్పథమేనని, ఆ రాష్ట్ర రాజకీ యాలపై ఆసక్తి లేదని స్పష్టం చేశారు. తన దృష్టంతా తెలంగాణపైనే ఉంటుందని తేల్చి చెప్పారు. లోక్ సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంగళవారంనాడు ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఏపీకి సంబంధించిన అంశాలపై స్పందించారు. కేంద్రప్రభుత్వంతోనూ మైత్రి కొనసాగిస్తామన్న ఆయన ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రభుత్వం అధికా రంలోకి వస్తుందని ప్రశ్నించగా.. అక్కడ వైఎస్ షర్మిళ ముఖ్యమంత్రి అవుతారని అభిప్రా యపడ్డారు. ఆమె ఎమ్మెల్యేగా పోటీ చేయలేదని, ఎంపీగా మాత్రమే బరిలో ఉన్నారని గుర్తు చేయగా, తాను ఎంపీగా ఉండి ముఖ్యమంత్రినిగా కాలేదా? అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏం చెప్పినా పరజలు నమ్మరని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన ఏం మాట్లాడకుండా తన వ్యవసాయ క్షేత్రంలో విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మారుస్తారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిం చారు. లడక్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తే.. అక్కడి ప్రజలు బీజేపీ ప్రభుత్వపై తిరగబడ్డారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇకనుంచి ఆకస్మిక తనిఖీలు, సమీక్షలు ఉంటాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

***తెలంగాణలో కాంగ్రెస్‌కు అనూహ్య ఫలితాలు***

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్య ఫలితాలు సాధిస్తుందని, ఈ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఆరేడు సీట్లలో డిపాజిట్లు కోల్పో తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గాలి ఏమాత్రం వీయ లేదని, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 20వేల మెజారిటీతో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారంతో ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతివిమర్శలు, దూషణలు, ప్రతిదూ షణలు ముగిసిపోయాయని, బుధవారం నుంచి పాలనను పరుగులు పెట్టిస్తానని చెప్పారు.ఫోన్‌ట్యాపింగ్, ధరణిపై అసెంబ్లీలో చర్చించి విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటామని సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు.

***9 నుంచి 13 సీట్లు మావే!***

సార్వత్రిక ఎన్నికల్లో మిషన్-15 లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో అగుడుపెట్టిన తెలంగాణ కాంగ్రెస్ మొదటి నుంచీ ప్రకటించిన ధీమాకు అనుగుణంగా ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తోందని, 9 నుంచి 13 స్థానాల్లో పక్కగా గెలుస్తామని టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలింగ్ ముగిసిన నేపథ్యం లో మంగళవారం తన అనివాసంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇంఛార్జీలు, ఇతర ముఖ్య నేతలతో సమీక్షించారు. ఓటింగ్ సరళి, ప్రజల్లో స్పందన, నాయకులు, కార్యకర్తల పనితీరు.. తదితర అంశాలపై లోతుగా చర్చించారు. సుమారు గంటకు పైగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అంచనాలు, ఫలితాలపై విశ్లేషణ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో మెజారిటీ వర్గాలు కాంగ్రెస్ పరిపాలన పట్ల సంతృప్తిగా ఉన్నారని, ప్రజాపాలనకే మద్దతు పలికారని స్పష్టం చేశారు. కేవలం నాలుగు నెలల్లోనే ఆరు గ్యారెంటీలకు అమలు చేసిన ఘనతను ప్రజలు గుర్తించారని, ఫలితంగా కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ సీట్లు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

***అంచనాల విశ్లేషణపై ఏఐసీసీకి రిపోర్టు..***

సార్వత్రిక పోరులో భాగస్వామ్యం పంచుకున్న ఏఐసీసీ అగ్రనేతలందరితోనూ టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పోలింగ్ సరళి, అంచనాల విశ్లేషణ గురించి నివేదించారు. రాష్ట్రంలో రాజకీయ సానుకూలతలు, కలిసివచ్చిన అంశాలపై ఏఐసీసీకి రిపోర్టు పంపించారు. ఆ సమాచారం ప్రకారం.. ''రాష్ట్రంలో అత్యధిక సీట్లను గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ అంచనా వేసుకున్నాం. అన్ని చోట్ల పోలింగ్ తమకు అనుకూలంగా జరిగింది. ఓటర్లు తమ ప్రజాపాలనను ఆశీర్వదించారు. ఆ ధీమాతో పార్టీ వర్గాల్లో ఉత్తేజాన్ని నింపింది. ఇప్పటివరకు ఉన్న సర్వేల రిపోర్టులు, పార్టీ నేతల అభిప్రాయాలు, వివిధ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో 13 సీట్లు పక్కాగా గెలుస్తామనే అంచనాకు వచ్చాం. పోలింగ్ జరిగిన తీరును సమీక్షించాం'' అని అధిష్టానానికి నివేదించారు.

# మరో రెండు రోజులు వానలే

• కనిగిరిలో 43.5 మిమీ వర్షపాతం నమోదు
• గంగవరం, రేణిగుంటలో 40.6 డిగ్రీల ఉష్ణోగ్రత



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల నాటికి ప్రకాశం జిల్లా కనిగిరిలో 43.5మిమీ,గుంటూరు జిల్లా ఫిరంగిపురం 34మిమీ, ప్రత్తిపాడులో 33మిమీ, అల్లూరి జిల్లా జీకే వీధిలో 30మిమీ,ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో 29మిమీ, నంద్యాల జిల్లా ఆత్మకూరులో 25.5మిమీ, మంగళగిరిలో 25.5మిమీ, పల్నాడు అమరావతిలో 19.5మిమీచొప్పున వర్షపాతం నమోదైంది. దక్షిణ అంతర్భాగ కర్నాటక పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం , ఆగ్నేయ అరేబియా సముద్రం ఆనుకుని ఉన్న కేరళ నుండి కర్ణాటక మీదుగా మరత్వాడా వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ఉన్న ద్రోణి తో విలీనం అయినదని ఐఎండీ పేర్కొంది. నైరుతి రుతుపవనాలు ఈనెల 19వ తేదీ నాటికి దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళా ఖాతంలోని కొన్ని ప్రాంతా లు మరియు నికోబార్ దీవులలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు సూచించింది. బుధవారం అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతిజిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామ రాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య మరియు చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్ల క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు.మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం, తిరుపతి జిల్లా రేణిగుంటలో 40.6 డిగ్రీల సెల్సియస్ అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా, వైయస్ఆర్ జిల్లా సిద్ధవటంలో 40.3, తూర్పుగోదావరి జిల్లా సీతానగరం, ప్రకాశం జిల్లా మార్కాపురంలో 40.2, ఏలూరు జిల్లా పోలవరంలో 40.1 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. బుధవారం శ్రీకాకుళం 9, విజయనగరం 12, మన్యం 10, అల్లూరిసీతారామరాజు 3 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

# కవిత రిమాండ్ పొడిగింపు

***ఈ నెల 20న ఈడీ చార్జిషీటుపై విచారణ***

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషి యల్ కస్టడీని ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు ఈ నెల 20 వరకు పొడిగించింది. ఢిల్లీ మద్యం పాలసీ - మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కవితను ఈ ఏడాది మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ ఖైదీగా ఆమె ఢిల్లీలోని తిహాడ్ జైల్లో ఉంచారు. మంగళవారం ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను వీడియో కాన్ఫరెన్స్ విధానంలో రౌజ్ అవెన్యూ కోర్టు కాంప్లెక్సులోని సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజా ఎదుట హాజరుపరిచారు.

ఇదే కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు చేస్తున్న కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీ ఈ నెల 20 వరకు ఉండడంతో, ఈడీ కేసులోనూ జ్యుడీషియల్ కస్టడీని ఆరోజు వరకు పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

## కూలీలపై నుంచి దూసుకెళ్ళిన ఆర్టీసీ బస్సు

# నలుగురు దుర్మరణం



**కోనసీమ, ప్రభన్యూస్ బ్యూరో**:డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం మండలం ఊడిమూడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రహదారి పక్కన ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న కూలీలపై ఆర్టీసీ బస్సు దూసుకుపోవడంతో అక్కడికక్కడే నలుగురు మృతి చెందారు. ఇద్దరు పరిస్థితి విషమం గాను మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వారిని కొత్తపేట ఏరియా ఆసుపత్రి కి తరలించారు. ట్రాక్టర్ పైకి ధాన్యాన్ని లోడు చేసి పగ్గం బిగిస్తుండగా ఈ సంఘటన జరిగింది. రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం సాయంత్రం గన్నవరం మీదుగా రాజమహేంద్రవరం వెళుతోంది. చింతావారి పేట ఊడిమూడి మధ్యలోనున్న అడ్డాల వారి శాల వద్ద ,రోడ్డుకు ఎడమవైపున ఉంచి,ట్రాక్టర్ పై కూలీలు ధాన్యాన్ని లోడు చేస్తున్నారు. లోడు పూర్తైన తరవాత బస్తాలు పడిపోకుండా పగ్గం బిగిస్తుండగా రాజమహేంద్రవరం వెళుతున్న ఆర్టీసీ బస్సు కూలీలను ఢీ కొనడంతో 4 గురు కూలీలు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు ,ఇద్దరు పరిస్థితి విషమం గా ఉండటంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ముగ్గురు జి పెదపూడికి చెందిన వారు కాగా మరొకరు ఆదిమూల వారి పాలెం వాసిగా గుర్తించారు.

## 16 నుంచి 12 జిల్లాల్లో

# వయోజనులకు బీసీజీ టీకా

**అమరావతి, ఆంధ్రప్రభ:**రాష్ట్రంలో 2025 నాటికి టీబీ కేసులను పూర్తిగా నిర్మూలించటంతో పాటు కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించే లక్ష్యంతో 18 ఏళ్ళు పైబడిన వయోజనులకు బీసీజీ టీకా అందించే కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీ నుండి రాష్ట్రంలోని 12 జిల్లాలలో మొదటి విడత లో ప్రారంభించనున్నట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, విజయనగరం, క్రిష్ణా, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలలో ఆరు కేటగిరీలకు చెందిన అర్హులైన వ్యక్తులకు మూడు నెలల వ్యవధిలో ఈ బిసిజి టీకా అందించనున్నట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా క్షయ నివారణ , జిల్లా ఇమ్యునైజేషన్ అధికారులు సంయుక్తంగా అమలు చేస్తారన్నారు.

క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎం, ఆశా, సిహెచ్ఓ, మరియు టిబి ఛాంపియన్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 12 జిల్లాలకు ఇప్పటికే నోడల్ అధికారులను నియమించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం టిబి మందులు వాడి వ్యాధి తగ్గించుకున్న వారు, 2021 సంవత్సరంలో టిబి మందులు వాడిన టిబి పేషెంట్స్ యొక్క కాంటాక్ట్స్, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు వున్న వారు, 60 ఏళ్ళు పైబడిన వారు, 18 కేజీల కంటే బరువు తక్కువ, ఎం2 ఉన్న కేటగిరిలలోని వ్యక్తులకు బిసిజి టీకాను వేస్తారన్నారు.


NELCAST LIMITED

**CIN: L27109AP1982PLC003518**

Regd. Office: 34 Industrial Estate, Gudur - 524 101. Tel: 08624-251266

Fax: 08624-252066 Website: www.nelcast.com Email: nelcast@nelcast.com

**31 మార్చి, 2024తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరం కొరకు ఆడిట్ చేసిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల యొక్క నివేదిక (₹ లక్షలలో)**

| క్ర స ం. | వివరాలు | స్వతంత్ర | | | | | ఏకీకృత | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ముగిసిన 3 నెలలు | | | ముగిసిన సంవత్సరం | | ముగిసిన 3 నెలలు | | | ముగిసిన సంవత్సరం | |
| | | 31.03.2024 | 31.12.2023 | 31.03.2023 | 31.03.2024 | 31.03.2023 | 31.03.2024 | 31.12.2023 | 31.03.2023 | 31.03.2024 | 31.03.2023 |
| | | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేసినవి |
| 1 | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం | 29921.20 | 32297.46 | 31517.76 | 128121.60 | 128011.84 | 29921.20 | 32297.46 | 31517.76 | 128121.60 | 128011.84 |
| 2 | నికర లాభం / (నష్టం) (పన్నుకు ముందు మరియు సాధారణ కార్యకలాపాల నుండి) | 540.83 | 1388.25 | 599.22 | 5081.84 | 4031.70 | 540.83 | 1388.25 | 599.22 | 5081.84 | 4031.70 |
| 3 | పన్నుకు ముందు నికర లాభం / (నష్టం) (సాధారణ కార్యకలాపాలు మరియు అసాధారణమైన అంశాల* నుండి) | 591.81 | 3117.06 | 599.22 | 6861.63 | 4031.70 | 591.81 | 3117.06 | 599.22 | 6861.63 | 4031.70 |
| 4 | పన్ను తరువాతి నికర లాభం / (నష్టం) (సాధారణ కార్యకలాపాలు మరియు అసాధారణమైన అంశాల* నుండి) | 506.54 | 2553.06 | 448.40 | 5441.12 | 2973.54 | 506.54 | 2553.06 | 448.40 | 5441.12 | 2973.54 |
| 5 | పన్ను తరువాత మొత్తం సమగ్ర లాభం | 541.35 | 2536.77 | 455.19 | 5427.03 | 2933.19 | 541.35 | 2536.77 | 455.19 | 5427.03 | 2933.19 |
| 6 | ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ. 2/- చొప్పున పూర్తిగా చెల్లించినది) | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 |
| 7 | ఇతర ఈక్విటీ (ఆడిట్ చేసిన ఆస్తి అప్పుల పట్టికలో చూపిన విధంగా) | | | | 50179.06 | 45100.04 | | | | 50179.06 | 45100.04 |
| 8 | ప్రతి వాటా ఆర్జనలు రూ. 2/- చొప్పున (త్రైమాసికాల కొరకు ఇపిఎస్ వార్షీకరించబడినది) బేసిక్ | 0.58 | 2.93 | 0.52 | 6.25 | 3.42 | 0.58 | 2.93 | 0.52 | 6.25 | 3.42 |
| | డైల్యూటెడ్ | 0.58 | 2.93 | 0.52 | 6.25 | 3.42 | 0.58 | 2.93 | 0.52 | 6.25 | 3.42 |

గమనిక :

సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) నిబంధనలు 2015 యొక్క 33వ నిబంధన ప్రకారం స్టాక్ ఎక్ఛేంజ్‌లతో దాఖలు చేయబడిన ఆర్థిక ఫలితాల సవివర నమూనా యొక్క సారాంశం పైన తెలుపబడినది. త్రైమాసిక / వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనాలు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్‌లు: www.bseindia.com, www.nseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్ www.nelcast.com పై లభించును.

* మార్చి, 31,2024 తో ముగిసిన త్రైమాసికంలో, సంస్థ యొక్క అసాధారణ అంశాల నుండి అనగా భూమి అమ్మకంపై పన్నుకు ముందు వచ్చిన లాభం 50.98 లక్షల రూపాయలు మరియు మార్చి 31, 2024తో ముగిసిన సంవత్సరమునకు రూ. 1779.79 లక్షల రూపాయలు.

For Nelcast Limited

Place : Chennai
Date : 13.05.2024

P. Deepak
Managing Director